

రెడ్‌క్రాస్, సైనిక సంక్షేమ నిధికి విరాళాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రెడ్ క్రాస్ సొసైటీ శాశ్వత సభ్యత్వ నమోదు కోసం రూ.2.20 లక్షల చెక్కును, సైనిక్ సంక్షేమ నిధికి ఉపాధి హామీ కూలీల తరపున సేకరించిన రూ.3.54 లక్షల చెక్కును డ్వామా పీడీ ఎం.నాగమల్లేశ్వర రావు, కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో రెడ్‌క్రాస్ కార్యకలాపాలు మరింత విస్తరించాలని, అందుకు ప్రభుత్వ ఉద్యోగులు, యువత, ప్రజలు తమ వంతుగా భాగస్వామ్యం అవ్వాలని పిలుపునిచ్చారు. డ్వామాలో 200 మంది అధికారులు, సిబ్బంది రెడ్‌క్రాస్ సొసైటీలో లైఫ్ టైమ్ సభ్యత్వానికి రూ.2.లక్షలు 20 వేలు చెల్లించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిడి బి.రామ్ ప్రసాద్, డివిఓ కె.రత్నకుమారి, జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి సత్య ప్రసాద్, డ్వామా ఉద్యోగులు పాల్గొన్నారు.

మందు బిళ్ల.. జేబు గుల్ల..

జనరిక్ పేరుతో మెడికల్ షాపుల దోపిడీ
ప్రైవేట్ ఆస్పత్రులలోనూ ఇదే తంతు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో జనరిక్ వ్యాపారం జోరుగా సాగుతోంది. జనరిక్ మందులను ఎంఆర్‌పి రేట్లకే విక్రయిస్తూ ప్రజలను దోచేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 80 శాతం తక్కువకు అందించాలి. ఏది జనరిక్ మందో తెలియక మందుల దుకాణాల మాయాజాలంతో ప్రజలు మోసపోతున్నారు. జిల్లావ్యాప్తంగా 1,040 మెడికల్ షాపులు ఉన్నాయి. హోల్‌సేల్ షాపులు సుమారు 200 ఉన్నాయి. జిల్లాలో మొత్తం 60 జనరిక్ మెడికల్ షాపులు ఉన్నాయి. ఇందులో 24 హోల్‌సేల్ దుకాణాలు ఉండగా 36 రిటైల్ దుకాణాలు ఉన్నాయి. గుర్తింపునిచ్చిన జనరిక్ దుకాణాల్లో రూ.80కి విక్రయించే మందును పెద్ద మెడికల్ షాపుల్లో రూ.150కి విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ఔషధ దుకాణాల్లో అడ్డగోలు దోపిడీని అరికట్టాల్సిన డ్రగ్ కంట్రోల్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఔషధ నియంత్రణ అధికారుల లెక్కల ప్రకారం రాజమహేంద్రవరం నగరంలోనే 10 జనరిక్ హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. ప్రతిరోజూ ఈ షాపులకు కనీసం 5 నుంచి 10 లారీల సరుకు వస్తోంది. అంతే మొత్తంలో ఇక్కడి నుంచి సరుకు బయటకు వెళుతున్నట్టు సమాచారం.

ప్రిస్క్రిప్షన్‌పై అమ్మకుంటే కఠిన చర్యలు

యాంటీబయాటిక్స్, అబార్షన్ కిట్స్, వయాగ్రాను ప్రిస్క్రిప్షన్‌పైనే అమ్మాలి. లేకుంటే కఠిన చర్యలు తప్పవు. వారం రోజులుగా యాంటీబయాటిక్స్, మత్తు మందులు, ఎన్ఆర్ఎక్స్ మందులు, అబార్షన్ కిట్లు, వయాగ్రా మందులు, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ మీద అమ్ముతున్నారనే వార్తలపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేస్తున్నారు. దుళ్లలోని శ్రీనివాస మెడికల్ స్టోర్స్, శ్రీమెడికల్స్‌లో వయాగ్రా, అబార్షన్ కిట్స్ బిల్ లేంకుడా అమ్మడంతో చట్టపరమైన చర్యలకు ఆదేశించాము

- డి.నాగమణి,
డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్.

ఏడాదికి రూ.కోట్లలో జనరిక్ మెడిసిన్ వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

20 శాతం రాయితీ ఒట్టిమాయ

జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో 230 మెడికల్ షాపులు ఉన్నాయి. సుమారు 120కి పైగా హోల్‌సేల్ షాపులు ఉన్నాయి. కొన్ని మెడికల్



షాపుల్లో 20 శాతం రాయితీ ఇస్తుంటారు. సహజంగా మెడికల్ షాపుల్లో వినియోగదారులు ఎవ్వరూ బేరాలు చేయరు. అలాంటిది ఏకంగా 20 శాతం రాయితీతో మందులు విక్రయిస్తుండడంతో ప్రజలు ఆయా మెడికల్ షాపులకు క్యూకడుతున్నారు. వాస్తవానికి ఈ 20 శాతం రాయితీ పెద్ద మాయ అని కొందరు ఫార్మాసిస్టులు చెబుతున్నారు. 20 శాతం రాయితీ పేరుతో మందులు విక్రయిస్తున్న చైన్ మెడికల్ షాపులలో 75 శాతానికి పైగా జనరిక్ మందులను అమ్ముతున్నట్లు సమాచారం. నిజానికి జనరిక్ మందులను వాటిపై ఉన్న ఎంఆర్‌పి ధర కంటే 80 శాతం తక్కువకు విక్రయించాల్సి ఉంటుంది. బయట మార్కెట్లో జనరిక్ మెడికల్ షాపులలో తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. కానీ, అందుకు భిన్నంగా కొందరు మెడికల్ షాపుల నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతూ రెండు చేతులా సంపాదిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జనరిక్ మందులను బ్రాండెడ్ పేరుతో విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు.

ఆరోగ్యశ్రీ రోగులకు జనరిక్ మందులు

నగరంలోని పలు కార్పొరేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్నాయి. ఎక్కువగా గుండె జబ్బులు, పక్షవాతం వంటి జబ్బులకు వైద్య సేవలు అందిస్తున్న కార్పొరేట్ ఆస్పత్రుల్లో జనరిక్ మందులిచ్చి ఎంఆర్‌పి బిల్లులు చేసుకుంటున్నట్టు సమాచారం. గుండె జబ్బుతో బాధ పడుతున్న వ్యక్తికి గుండె కవాటాల్లో రక్తం గడ్డకట్టకుండా టికాగ్రేలార్ 90 ఎంజి మందును డాక్టర్ రాశారు. దానిమీద ఎంఆర్‌పి రూ.350 రూపాయలు ఉంది. నిజానికి ఇది జనరిక్ ఔషధం. బహిరంగ మార్కెట్లో దీన్ని కేవలం రూ.60 నుంచి రూ.75 మాత్రమే విక్రయించాలి. కానీ ఆ కార్పొరేట్ ఆస్పత్రిలో దీనికి ఎంఆర్‌పి బిల్లు ఇవ్వడం గమనార్హం. కొలెస్టరాల్‌ను నియంత్రించే రోసువాస్టాటిన్ 40 ఎంజి మందుపై ఎంఆర్‌పి రూ.584 ఉంది. దీన్ని కూడా ఎంఆర్‌పికే ఇస్తున్నారు. నిజానికి ఈ మందు జనరిక్ మెడికల్ షాపులలో కేవలం రూ.80కే లభిస్తుంది. లివోసిట్రిజన్ ట్యాబెట్ల మీద ఎంఆర్‌పి రూ.99.55 ఉండగా, ఇది జనరిక్ మెడికల్ షాపులో కేవలం రూ.6కే లభిస్తుంది. ఇదే పెద్ద మెడికల్ షాపులలో మీద 20 శాతం ఇచ్చి రోగుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. గ్యాస్ ట్రబుల్‌కు వాడే ర్యాబిప్రజోల్, పెంటాప్రజోల్ ట్యాబ్లెట్ల మీద కూడా ఇదే తరహాలో బాదేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఔషధ నియంత్రణ శాఖ, ఆరోగ్యశ్రీ అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జనరిక్, సాంపిల్స్ మందుల జోరు

ప్రైవేటు ఆస్పత్రుల్లో బ్రాండెడ్ మందులు విక్రయిస్తున్న దాఖలాలు కనిపించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ డాక్టర్ మందులు రాశాడంటే బయట ఎక్కడా దొరకవని తరచూ రోగులు చెబుతుంటారు. అవన్నీ థర్డ్ పార్టీ మందులని రోగులకు తెలియదు. అతి తక్కువ ధరలకు మందులు కొనుగోలు చేసి పదింతల రెట్టింపు ధరలకు విక్రయిస్తూ రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకూ విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడటమే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలో బుధవారం విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు అంశాలపై చర్చించి, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో పిఎం సూర్యఘర్, పిఎం కుసుమ్ పనులు, ఆర్‌డిఎస్ఎస్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో సూర్యఘర్, కుసుమ్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, పనులను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకున్న అన్నదాతలందరికీ వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మీడియాతో మాట్లాడుతూ... విద్యుత్ అంతరాయాలు, లో ఓల్టేజ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణంతో పాటు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన లైన్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి వివరించారు. రాజమండ్రి వేదికగా రాబోయే గోదావరి పుష్కరాలకు విద్యుత్ అధికారులు ఇప్పటి నుంచి సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ శాఖను నిర్వీర్యం చేశారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. విద్యుత్ శాఖపై కొందరు అపోహలు సృష్టించి గందరగోళం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకు 75,000 వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఎంఎల్‌ఎలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, పాటు విద్యుత సంస్థ ఎస్ఇ కె.తిలక్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ పొడిగింపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను 2025-26 ఆర్థిక సంవత్సరానికి పొడిగించినట్టు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుడు హిమాన్షు శుక్లా ఆదేశాలు జారీ చేశారన జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా అమలులో ఉన్న ఈ పథకానికి జర్నలిస్టులు వారి వాటా రూ.1250 పిఎఫ్ఎంఎస్ పోర్టల్ www.cfms.ap.gov.in ద్వారా చెల్లించాల్సి ఉంటుందని తెలపారు. దీనికి సంబంధించి పూర్తి ప్రీమియం రూ.2500కాగా, జర్నలిస్టు వాటా రూ.1250, మిగిలిన భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఈ స్కీమ్ కింద జర్నలిస్టు, ఆయన/ఆమె భార్య/భర్త, పిల్లలు మరియు ఆధారిత తల్లిదండ్రులకు నగదు రహిత వైద్య సేవలు లభించనున్నాయని తెలిపారు. ఏటా రూ.2 లక్షల వరకు ఖర్చయ్యే వైద్య సేవలు పరిమితులు లేకుండా అందుబాటులో ఉంటాయని, నిర్ధేశిత చికిత్సలకు ఉచిత ఒపి సేవలు కూడా లభిస్తాయన్నారు. జిల్లా పరిధిలో అక్రిడిటేషన్ కలిగి ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రీమియం చెల్లించిన చాలానా, రెన్యూవల్ చేయించిన అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ కాపీ, ఇతర అవసరమైన డాక్యుమెంట్స్‌తో పాటు శ్రీవెంకటేశ్వర ఆనం కళా కేంద్రం, రాజమహేంద్రవరంలోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఆఫీస్ పని దినాల్లో సమర్పించాలని సూచించారు.

వాట్సాప్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వాట్సాప్ నెంబరు 9866657600ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు, జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుధ్యం, ఇంటి పన్నులు, మురుగు నీటి పారుదల, తాగునీరు, రోడ్ల మరమ్మతులు, ట్రాఫిక్ సమస్యలు, ధ్రువీకరణ పత్రాల వంటి వివిధ సమస్యలను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి నేరుగా తెలియజేసేందుకు ఈ నెంబరుకు నగర, జిల్లా పౌరులు తమ పేరు, సమస్య వివరాలు, నివాస ప్రాంతం సమాచారం సహా సందేశం పంపితే, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభంగా, వేగంగా అందించాలన్న ఉద్దేశంతో ఈ చర్య తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

బీమా సౌకర్యం ఉండాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి


విద్యుత్ పని చేసుకునే కార్మికులకు బీమా సౌకర్యం కలిగి ఉండాలని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. రావిపాటి ఫంక్షన్ హాల్లో బుధవారం సౌండ్స్ లైటింగ్ డెకరేషన్ అండ్ సప్లై కంపెనీ అసోసియేషన్ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘం సొంత భవనం నిర్మించుకోవడానికి స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా జీవితంలో నిత్యావసర వస్తువులుగా మారిన లైటింగ్ సప్లై కంపెనీ నిర్వాహకులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ ఖాతాదారుల మన్ననలు పొందాలని అన్నారు. కంఠమని రామకృష్ణ, గంటా కృష్ణలను సభ్యులు ఘనంగా సత్కరించారు. కొండే వెంకటరమణ, డివి, రామబ్రహ్మం, సిహెచ్. రామకృష్ణ, రమణ, కృష్ణంరాజు, శ్రీనివాస్ గోపి, కృష్ణ, కిరణకుమార్ పాల్గొన్నారు.

భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-కడియం

కడియపులంక శ్రీసత్యదేవ నర్సరీలో డిస్‌పి భవ్య కిషోర్ ఆధ్వర్యంలో బుధవారం భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా భద్రత, సైబర్ భద్రత, రోడ్డుప్రమాదాల నివారణ చర్యలు, పోక్సో చట్టం, ఈవ్ టీజింగ్ వంటి ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. శక్తి బృందాల పనితీరు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ అధినేత పుల్లా పెద్ద సత్యనారాయణ, సిఐ ఎ.వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ సిహెచ్.రమణ, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, నర్సరీ రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



విద్యుత్ స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రజల జేబులు ఖాళీ చేసి అదానీ కంపెనీకి లాభాలు తెచ్చిపెట్టే స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని, గృహ వినియోగదారులకు ఏర్పాటు చేసేందుకు యత్నిస్తే అడ్డుకొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరుణ్ మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ఆదేశాలతో గత వైసిపి, ప్రస్తుత టిడిపి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయన్నారు. ప్రతిపక్ష నేతగా గత ప్రభుత్వ హయాంలో నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు బద్దల కొట్టాలంటూ ఇచ్చిన పిలుపుని గుర్తు చేశారు. వైసిపి స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై తన వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు అంటూ ప్రచురించిన పోస్టర్‌ను ప్రతి ఇంటికి పంపిణీ చేయనున్నామని అన్నారు. ఛార్జీలు పెంచబోమంటూ టిడిప అధికారంలోకి వచ్చిందని, దొడ్డి దారిన సర్దుబాటు ఛార్జీల పేరుతో వినియోగదారుల నడ్డివిరిచిందని వివరించారు. ఇప్పటికే వాణిజ్య సముదాయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారని తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించడం ఆలస్యమైతే ఎటువంటి సమాచారం లేకుండా సరఫరా నిలిపివేస్తున్నారన్నారు. విద్యుత్ బిల్లులతోపాటు సుమారు రూ.9 వేల నుంచి రూ.17 వేల వరకూ స్మార్ట్ మీటర్ల ఛార్జీలు సైతం వినియోగదారులవద్ద నుండి వసూళ్లకు కూటమి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని వివరించారు. వినియోగదారుల అనుమతి లేనిదే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే అధికారం అదాని సంస్థ ప్రతినిధులకు లేదని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జువ్వల రాంబాబు, బి.పవన్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కెఎస్‌వి.రామచంద్రరావు, బి.పూర్ణిమ రాజు, ఎస్ఎస్.మూర్తి, ఐ.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

విచక్షణారహితంగా యూరియా వాడొద్దు

ప్రజాశక్తి - నిడదవోలు రూరల్, ఉండ్రాజవరం

నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్.శ్రీనివాస్ పాల్గొని రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు. వారు రైతులతో మాట్లాడుతూ రైతులు యూరియాను అధిక మొత్తంలో విచక్షణా రహితంగా వాడుతున్నారని, ఖరీఫ్‌లో వరి పంటకు 75 కిలోల యూరియా సరిపోతుందని తెలిపారు. దీన్ని మూడు దఫాలుగా వేసుకోవాలన్నారు. కానీ రైతులు వరి చేలో నీరు ఉన్నప్పుడు యూరియా వేస్తున్నారని, దీని వల్ల అధిక శాతం ఆవిరి రూపంలో, పక్క చేలకు నీటి ద్వారా అధిక మొత్తంలో వృథాగా పోయి మొక్కకు అందడం లేదన్నారు. దీని వల్ల అధిక మొత్తంలో యూరియాను వాడుతున్నారని, దీన్ని నివారించడానికి బురదలో మాత్రమే చల్లి 24 గంటల తర్వాత నీరు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.సత్యనారాయణ, ఎఇఒ శివనాగు, గ్రామ వ్యవసాయ సహాయకులు దాసు, వినయ్, రైతులు ఉప్పులూరి రామ్మోహన్ రావు, గోగిన శ్రీనివాస్, మద్దిపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం అధిక రసాయనక ఎరువుల వినియోగం అనర్థదాయకమని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నరసింహారావు అన్నారు. బుధవారం మండలంలోని చివటం, పాలంగి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోందని కార్యక్రమంలో భాగంగా రైతుల సమావేశంలో జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ జయ, శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్‌తో కలిపి మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎలు జగదీశ్వరి, దుర్గ పాల్గొన్నారు.

పలుచోట్ల సుపరిపాలనలో తొలి అడుగు

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యాన బుధవారం పలుచోట్ల సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని ఇంటింటికీ తిరికి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

ఉండ్రాజవరం ప్రమాదాలు జరగకముందే, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సిబ్బందికి సూచించారు. సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన మండలంలోని చివటంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రచారంలో పాల్గొన్న ఆయనకు, మహిళలు తమ ఇంటి వద్ద ఉన్న విద్యుత్ స్తంభం నుండి తరచూ మంటలు వస్తున్నాయని, స్తంభం సైతం, ఫ్యూజ్ బాక్స్ తో అందుబాటులో ప్రమాదకరంగా ఉందని వాటిని తొలగించాల్సిందిగా మంత్రిని కోరారు. డంపింగ్ యార్డ్ సమస్యపై మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి శేషారావు, మంతెన రామరాజు, సింహాద్రి రామకృష్ణ పాల్గొన్నారు.

సీతానగరం చినకొండేపూడిలో విద్యుత్ శాఖ మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్, రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, నీరుకొండ వీరన్న చౌదరి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతత్వంలోని కూటమి ప్రభుత్వం గత ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ, అభివద్ధి పథకాలను ప్రజలకు వివరంగా వివరించారు. తొలుత డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



సీతానగరంలో ప్రచారంలో పాల్గొన్న మంత్రి రవికుమార్

తాళ్లపూడి ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వర రావు పోచవరం, తుపాకులగూడెం, రాగోలపల్లిలో బుధవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. కంఠమని రామకృష్ణ పాల్గొనగా వీరికి పోచవరంలో అనపర్తి ప్రసాద్, రాగోలపల్లిలో చలపతి ప్రకాష్ ఘన స్వాగతం పలికారు.



మలకపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ప్రశాంతి

పి ఫోర్ దత్తత కుటుంబానికి వసతుల కల్పన

ప్రజాశక్తి- తాళ్లపూడి

మలకపల్లి గ్రామానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చిన సమయంలో పి4 పథకం కింద గుర్తించిన గ్రామానికి చెందిన సనమండ్ర పోసి బాబు ఇంటికి సంబంధించి చేయవలసిన పునర్నిర్మాణ పనులను పరిశీలించేందుకు కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం మలకపల్లి వచ్చారు. ఈ క్రమంలో దత్తత కుటుంబానికి జీవనోపాధి కోసం వ్యాపారం చేసుకునేందుకు మెయిన్ రోడ్డు దగ్గరలో షాపు పెట్టుకునేందుకు అవకాశాలు కల్పిస్తూ స్థలాన్ని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో కలెక్టర్ వెంట తహశీల్దారు లక్ష్మీ లావణ్య, ఎంపిడిఒ వేణుగోపాల్ రెడ్డి, హౌసింగ్ పీడీ భాస్కర్ రెడ్డి, డిఇఇ శేఖర్‌బాబు, ఎఇ దాదాసాహెబ్, పంచాయతీ కార్యదర్శి కామేశ్వరి, ఆర్ఐ రామకృష్ణ, విఆర్ఓ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ పనుల తనిఖీ

ప్రజాశక్తి-చాగల్లు

డిప్యూటీ ఎంపిడిఒ ఆర్.శ్రవణ్ కుమార్ మార్కొండపాడు శివారు గరపపాడులో బుధవారం డోర్ టు డోర్ చెత్త సేకరణ పనులను, డ్రైన్ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు ప్లాస్టిక్ వస్తువులు క్యారీ బ్యాగులు డ్రైనేజీల్లో వెయ్యరాదని, పంచాయతీ క్లాప్ మిత్రలకు ఇవ్వాలని కోరారు. అనంతరం గ్రామంలోని కిరాణా దుకాణాలకు వెళ్లి, ప్రజల అనారోగ్యానికి కారకాలైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగించరాదని, అమ్మరాదని తెలుపుతూ, ఒకవేళ షాపుల్లో ఎవరైనా వినియోగించిన అమ్మిన, భారీ జరిమానాలు విధిస్తామని, అవసరమైతే దుకాణం లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఎంఎల్ఎ నెహ్రూను సత్కరించిన రైతులు

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం ఎల్లమ్మ చెరువు పుంత రోడ్డు అభివద్ధికి నిధులు ఇచ్చి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను ఎల్లమ్మ చెరువు చైర్మన్ చింతలసత్యనారాయణ, వైస్ చైర్మన్ మైపాల భగవాన్ రైతులతో కలిసి బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లమ్మచెరువుకు వెళ్లే పుంత రోడ్డు అధ్వాన పరిస్థితిలో ఉండటంతో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ చొరవ తీసుకుని పుంత రోడ్డు నిర్మాణం చేస్తూ రైతులకు అన్ని విధాలా సహకరిస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ పుంత రోడ్డును మరొక 500 మీటర్లు పెంచాలని, సచివాలయం 2 వద్ద ఉన్న ఖాళీ స్థలంలో రైతులకు కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇనకోటి నాగేశ్వరరావు, ఇనకోటి సత్యనారాయణ, నకోటి దివాణం, రెడ్డి వీర్రాజు, తదితర రైతులు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి మరలించేందుకు అరెస్టులు

ప్రజాశక్తి-కడియం

సమస్యల నుంచి రాష్ట్ర ప్రజల దృష్టిని మళ్లించేందుకు కూటమి ప్రభుత్వం శాంతియుత ఉద్యమాలను అణచివేస్తూ, అక్రమ అరెస్టులకు పాల్పడుతోందని వైసిపి రాజమహేంద్రవరం రూరల్ యువజన విభాగం అధ్యక్షుడు కొత్తపల్లి నాగశివాజీ విమర్శించారు. బుధవారం మండలంలోని బుర్రిలంకలో మీడియాతో మాట్లాడుతూ, రాజమహేంద్రవరం పేపర్ మిల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సమాయత్తమవుతున్న మాజీ ఎంఎలఎ జక్కంపూడి రాజాను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా హక్కుల కోసం పోరాడే వారిని రాత్రికి రాత్రి అరెస్టు చేయడం న్యాయసూత్రాలకు విరుద్ధమని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన నడుస్తోందని, ప్రజాస్వామ్యాన్ని మసకబార్చే చర్యలు జరుగుతున్నాయని అన్నారు

రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేత


ప్రజాశక్తి -దేవరపల్లి

ఇటీవల దేవరపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాకా రామకృష్ణకు వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతి చెందిన వ్యక్తికి విద్యుత్ శాఖ ద్వారా వచ్చిన రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియాను గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు అందించారు. ఈ కార్యక్రమంలో బొల్లిన బాబి, మెంటిమి సురేష్ పాల్గొన్నారు.

నవోదయ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

మునికూడలిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గ్రామంలో 5వ తరగతి విద్యార్థులకు, నవోదయ ఎంట్రన్స్ పరీక్షకు అవసరమైన మెటీరియల్‌ను రఘుదేవపురం గ్రామానికి చెందిన గెడ్డం కిషోర్ బాబు దంపతులు బుధవారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎన్.నాగమణి సమక్షంలో రఘుదేవపురం గ్రామస్తులు గెడ్డం కిషోర్ బాబు, సునీత దంపతులు వారి కుమార్తె, కుమారుల పుట్టిన రోజు సందర్భంగా ఉచితంగా నవోదయ ఎంట్రాన్స్ పరీక్షకు అవసరమైన మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ మెటీరియల్ విలువ సుమారు రూ.మూడు వేలు ఉంటుంది. ఈ సంధర్భంగా కిషోబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో తాను చదువుకుని గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగిగా, ఆ తర్వాత రైల్వేలో లోకో పైలట్ ఉద్యోగాన్ని సాధించగలిగానని తెలిపారు.



మెటీరియల్ పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని జగన్నయ కులపాలెం-తాళ్లపాలెం రోడ్డు మధ్యలో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తాళ్ల పొలం గ్రామానికి చెందిన వను కష్ణ(48) మృతి చెందారని ద్రాక్షారామం ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

విధి నిర్వహణలో లైన్‌మ్యాన్ మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లికి చెందిన విద్యుత్ లైన్‌మ్యాన్ బిళ్ళ చంద్రరావు(46) విధి నిర్వహణలో అస్వస్థతకు గురై బుధవారం మృతి చెందారు. ఆదివారం రాత్రి కరెంటు సరఫరా నిలిచిపోవడంతో పునరుద్ధరించడానికి వెళ్లి పాశర్లపూడి ఏటిగట్టు ప్రాంతంలో పడిపోయాడు. సహచర లైన్‌మ్యాన్ అమలాపురంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మతి చెందాడని తెలిపారు అతని కుటుంబ సభ్యులను ఎపిఇ టిడిసిఎల్ ఉద్యోగులు పరామర్శించారు

చోరీ కేసులో ఇద్దరికి జైలు

ప్రజాశక్తి -కొవ్వూరు

మోటార్ సైకిల్ చోరీకి పాల్పడిన కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరకి ఎజెఎఫ్‌సిం జడ్జి కె.నాగలక్ష్మి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. ఈ ఏడాది పట్టణంలో రెండు వేర్వేరు చోట్ల బైకుల చోరీకి పాల్పడ్డారన్నారు. ఈ కేసులో నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ శిక్ష విధించినట్టు ఆయన తెలిపారు.

బైకుల చోరీ కేసులో..

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం పోలీస్ స్టేషన్లో 2024లో బైక్ దొంగతనాల కేసులో బండారు రాము అనే నిందితునికి రాజమహేంద్రవరం ఏడో అదనపు కోర్టు నేరస్తుడికి ఏడు నెలల జైలు శిక్ష విధించారు. ముద్దాయి అరెస్ట్ అయిన నాటి నుండి నేటి వరకు రిమాండ్ ఖైదీగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉండగా ఆ కాలాన్ని (7 నెలలు)శిక్ష కాలంగా కోర్టు పరిగణించినట్టు ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు.



ఆన్లైన్ నమోదులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ రాజు

పారదర్శకంగా అసెస్మెంట్లు నమోదు చేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

స్వర్ణ పంచాయతీల ద్వారా అన్ని రకాల అసెస్మెంట్‌లు పారదర్శకంగా ఆన్లైన్ నమోదు చేయాలని ఎంపిడిఒ ఎ.రాజు అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని పంచాయతీలో జరుగుతున్న నమోదులను ఆయన పరిశీలించారు. అలాగే కంప్యూటర్ ఆపరేటర్లను జరిగిన, జరగబోయే నమోదులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెస్మెంట్లు, పన్నులు, ఇంటి అడ్రస్‌లు, వారి పేర్లు నమోదుల విషయంలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే అనధికార లే ఔట్ల జోలికి పోవద్దని కార్యదర్శులకు ఆదేశించారు. అలాగే స్వర్ణ పంచాయతీని ప్రణాళికబద్ధంగా నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

రావులమ్మకు సారె సమర్పణ

ప్రజాశక్తి -అంబాజీపేట

వాకలగరువు గ్రామ దేవత శ్రీ రావులమ్మ తల్లి అమ్మవారికి బుధవారం గ్రామ ఆడపడుచులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో ఆషాడం సారె సమర్పించారు. యాత్రికుల కోలాహం నడుమ గ్రామ ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలని కోరుతూ ఆషాడం సారె సమర్పించారు. రావులమ్మ ఆలయాన్ని పూలతో అలంకరించారు. పలు రకాల పండ్లు, స్వీట్లు, చలివిడి పానకాలు, వడపప్పు సమర్పించారు.

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని నియోజకవర్గ మైనారిటీ బిసి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రపురం నుంచి కోనసీమ జిల్లా అమలాపురం వెళ్లాలంటే కోటిపల్లి గోదావరి దాటి అక్కడ నుంచి అమలాపురం వెళ్ళి కలెక్టర్ , జిల్లా అధికారులను కలవాలంటే కనీసం 2 గంటలు సమయం పడుతుందన్నారు. యానాం బైపాస్ నుండి అమలాపురం వెళ్లాలంటే కనీసం3 గంటలు పడుతుందన్నారు. .దీని వలన సమయం వథా అవుతుందన్నారు. గత ప్రభుత్వం లో నూతన జిల్లాలు ఏర్పాటు చేసే సమయంలో ప్రజలు అభిప్రాయ సేకరణ చేస్తామని చెప్పి అర్జీలు స్వీకరించి ప్రజలు అభిప్రాయ సేకరణ చేయకుండానే క్రొత్త జిల్లాలు ఏర్పాటు చేశారని తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని దగ్గరగా ఉండే కాకినాడ జిల్లాలో కలపాలని గతంలో పోరాటం చేశామని. గత పాలకులు ఆ పోరాటానికి ఆటంకాలు కలిగించారని అన్నారు. అయితే రామచంద్రపురం నియోజకవర్గం లో ఉన్న మూడు మండలాలు అనగా రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలు ఉండగా కేవలం కాజులూరు మండలాన్ని మాత్రమే గత పాలకులు తమ స్వార్థంతో కాకినాడ జిల్లాలో కలిపి మిగిలిన రెండు మండలాలను కలపకుండా నియోజకవర్గం ప్రజలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు . ఇప్పటికైనా నియోజకవర్గం ప్రజలు స్పందించి మన పిల్లలు భవిష్యత్తు కొరకు కాకినాడ జిల్లాలో కలుపుట కొరకు పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన: మంత్రి

ప్రజాశక్తి - కాకినాడ, రౌతులపూడి

రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతుందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని 39వ డివిజన్లోని చీడీలపొరలో ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ మల్లిపూడి నాగ దీపిక అధ్యక్షతన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను స్థానిక ప్రజలకు వివరించారు. అనంతరం గర్భిణులకు జరిగిన సామూహిక సీమంతం కార్యక్రమంలో పౌష్టిక ఆహార కిట్లు అందించి ఆశీర్వదించారు. ముఖ్య మంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేసిన సుమారు రూ.7 లక్షల విలువ చేసే చెక్‌లను అందజేశారు. అనంతరం మోటార్ లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుంద న్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్లిపూడి వీరు, సుంకర పావని, తుమ్మల రమేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే రౌతులపూడి మండలంలోని ఎస్‌పైడిపాల గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో నెలకున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఎఎంసి ఛైర్మన్ బద్దిమని రామారావు, టిడిపి మండల అధ్యక్షులు తామర సత్యనారాయణ, ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పైల సాంబశివరావు, మాజీ సర్పంచ్ గొళ్ళు పెద్ద దివాణం, తదితరులు పాల్గొన్నారు.

రూ.26 వేలు పలికిన పులస

ప్రజాశక్తి - యానాం

గోదావరి నదికి వరదలు వస్తుండడంతో యానాంలో పులసల సందడి కొనసాగుతోంది. ప్రస్తుతం వేలంలో పులస చేపలు భారీ ధర పలుకుతున్నాయి. బుధవారం జరిగిన పాటలో 2 కిలోల పులస వేలంలో రూ.26 వేలకు భారీ ధర పలికింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక ధర కావడం విశేషం. ఈ సీజన్‌లో పులస చేపల కోసం చాలా మంది ఆసక్తి కనబర్చడం ఆనవాయితీ. ఈ సీజన్‌లో తొలి పులస చేప యానాం ఫిష్ మార్కెట్‌లో రూ.4 వేలు ధర పలికింది. కాని అది పులస కాదు విలస అని అపోహలు ఉన్నాయి. అయితే తర్వాత వచ్చే చేపలకు పులస ప్రియులు వేలంలో పోటీ పడడంతో మరో చేప రూ.15వేలు పలికింది. తర్వాత దొరికిన రెండు పులస చేపలు రూ.13 వేలు, రూ.18 వేలుగా అమ్ముడయ్యాయి. ఈ వారంలో మరో చేప రూ.22 వేల ధర పలికింది. అయితే తాజాగా 2 కిలోల పులస చేప రూ.26 వేలు పలికింది. ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన బెజవాడ సతీష్ రూ.26 వేలకు పులసను దక్కించుకున్నారు. యానాంలో పులసల సందడి మరికొన్ని రోజుల పాటు కొనసాగనుంది. గోదావరి నదికి వరదలు వచ్చే సమయంలో పులస సీజన్ ప్రారంభం అవుతుంది. ఈ ఏడాది గోదావరికి వరద నీటి తాకిడి పెరగడంతో పులస చేపల సీజన్ మొదలైంది. నదికి ఎర్ర నీరు ఉధృతంగా రావడంతో పులసలు ఎదురీదుతూ వస్తున్నాయి.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి: జడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి - తాళ్లరేవు

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జడ్‌పి సిఇఒ లక్ష్మణ్ ఆదేశించారు. బుధవారం మండలంలోని కోరంగి పంచాయతీ సీతారాంపురంలో ఆయన పర్యటించారు. ప్రతాప్ నగర్‌లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఇంటిలో చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తగా పంచాయతీ అందజేసిన డస్ట్ బిన్ లలో వేయాలని సూచించారు. ఏ ప్రాంతానికి ఏ రోజు, ఏ సమయంలో చెత్త సేకరణ వాహనాలు వస్తాయో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరగాలని అన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి జిల్లా అధికారులు పర్యటనలు చేస్తామని తెలిపారు. అనంతరం ప్రభుత్వం నిర్దేశించిన బంగారు కుటుంబం కార్యక్రమంలో భాగంగా పి-4 సర్వేలో సీతారాంపురంలో గుర్తించిన తిరునగరి సుగుణ కుటుంబాన్ని సందర్శించి కుటుంబ జీవన వవిధానం, ఆర్థిక పరిస్థితులు, పోషణ వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. ఆ కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి చిరు వ్యాపారం నిమిత్తం ఆర్థిక సాయం చేయడంతో పాటు ఆరోగ్య సమస్యలతో సతమతమౌతున్న కుమారుని వైద్యం అందించడానికి సహకరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి విజెవి. రమణ, సర్పంచ్ పెయ్యల మంగేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు ఇచ్చేముందు తెలియదా..?

ప్రజాశక్తి - సామర్లకోట

హామీలు ఇచ్చేముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూటమి పార్టీల నేతలకు తెలియదా? అని పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు ప్రశ్నించారు. బుధవారం పట్టణ వైసిపి విస్తృతస్థాయి సమావేశం పట్టణ వైసిపి అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత వైఎస్.జగన్‌కే దక్కుతుందని అన్నారు. సంపద సృష్టిస్తామని కబుర్లు చెప్పి నేడు హామీలు అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని మంత్రులు మాట్లాడటం దారుణమన్నారు. ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వ వైఫల్యం ప్రజలకు అర్థం అయిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనే ప్రజలు తగిన బుద్ధిచెప్పటానికి సిద్ధంగా ఉన్నారని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, నాయకులు దవులూరి సుబ్బారావు, ఆవాల లక్ష్మీనారాయణ, మన్యం చంద్రరావు, ఇరుసుమల్ల సాయి, సేపేని సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దాలి: డిపిఒ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలో పారిశుధ్య సక్రంగా నిర్వహించి మోడల్ పంచాయతీగా గండేపల్లి పంచాయతీని తీర్చిదిద్దాలని డిపిఒ కె.రవికుమార్ అన్నారు. బుధవారం గడేపల్లిలో చేపట్టిన పారిశుధ్య పనులు ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందితో ఆయన మాట్లాడి తడి, పొడి చెత్త సేకరణపై పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు గ్రామంలో పంచాయతీ ద్వారా చేసే పనులను పరిశీలించి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శి ఫణీంద్రకుమార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి కె.బాలమణి, డిప్యూటీ ఎంపిడిఒ ఐఎన్.శ్రీనివాస్, డిపిఆర్‌సి గణేష్, తదితరులు పాల్గొన్నారు.



రైతు పొలంలో నీటి కుంటలను పరిశీలిస్తున్న ఠలెక్టర్ షాన్‌మోహన్

నీటి కుంటలతో మెరుగైన ఆదాయం

ప్రజాశక్తి - శంఖవరం

ఉద్యాన రైతులు నీటి కుంటలతో మెరుగైన ఆదాయ వనరులను పెంపొందించుకోవచ్చని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. బుధవారం మండలంలోని కత్తిపూడి గ్రామంలో ఉపాధి హామీ చట్టంలో ఉద్యాన రైతు గాబు జనార్ధనరావు పొలంలో నిర్మించిన నీటి కుంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతుతో మాట్లాడి సాగు చేస్తున్న ఉద్యాన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో కలిసి కొబ్బరి మొక్కను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షపు నీరు వృథాగా పోకుండా భూమిలోకి ఇంకించేందుకు నీటి కుంటలు ఉపయోగపడతాయని అన్నారు. వీటి ద్వారా ఉద్యాన రైతులు మెరుగైన ఆదాయ వనరులను పెంపొందించుకోవచ్చని తెలిపారు. అయితే జిల్లాలో 2,500 నీటి కుంటలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 860 నీటి కుంటలు నిర్మించినట్లు ఆయన తెలిపారు. ఉద్యాన రైతులకు బహుళ ఆదాయాన్ని అందించే నీటి కుంటలను జిల్లాలో ప్రతి రైతు విధిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఎంపిడిఒ లక్ష్మి రెడ్డి, ఎపిడి పి.జగదాంబ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో సుపరిపాలన

ప్రజాశక్తి - మండపేట



పాల్గొన్న మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల

పట్టణంలోని 2,3 వార్డులలో బుధవారం నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి పాలనలో అభివద్ధిని మరిచారని వార్డులలో కనీస వసతులు కూడా పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివద్ధి సంక్షేమం చేస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి వైసిపి కార్యకర్తలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అద్దంకివారిలంక జగ్జీవన్ నగర్ కు చెందిన వైసిపి కార్యకర్తలు బుధవారం టిడిపిలో చేరారు. స్థానిక గ్రామ టిడిపి అధ్యక్షులు గాలిదేవర వసంతరాయుడు ఆధ్వర్యంలో మండపేట పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు సమక్షంలో వైసిపి కార్యకర్తలు వీడి టిడిపిలో చేరారు. టిడిపిలో చేరిన వారిలో మల్లిపూడి లక్ష్మణరావు, మల్లిపూడి సత్యనారా యణ, మల్లిపూడి ఏడుకొండలు, మల్లిపూడి ఏసు, మల్లిపూడి ఆనందరావు, మల్లిపూడి చిన అర్జన్న, మల్లిపూడి గంగయ్య, మల్లిపూడి జార్జి, మల్లిపూడి చిన ఏడుకొండలు ఉన్నారు. వీరందరికీ ఎంఎల్ఎ వేగుళ్ల పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబుపాల్గొన్నారు.

వైద్యానికి ఆదిత్య వాలంటీర్ల విరాళం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెంలో ఉన్న ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు దాతృత్వాన్ని చాటుకున్నారు. భీమవరం పట్టణానికి చెందిన కె.విహాంత్ అర్జున్ అనే బాలుడు విజయవాడలో క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తమ పాకెట్ మనీ నుంచి కొంత సొమ్మును సేకరించి సుమారు రూ.68 వేలను యూనివర్సిటీ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డికి అందజేశారు. వాలంటీర్లు సేకరించిన సొమ్మును త్వరలోనే బాలుడి కుటుంబీకులకు అందజేస్తామని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ డి.కిషోర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఐవి. వీరాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - పిఠాపురం

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మాజీ ఎంపి వంగా గీత విమర్శించారు. బుధవారం స్థానిక రైస్ మిల్లర్లు అసోసియేషన్ కల్యాణ మండపంలో వైసిపి మండల అధ్యక్షులు అడపా రఘు అధ్యక్షతన మండల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో పెన్షన్ ఇవ్వడం తప్ప ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. బటన్ నొక్కడం పెద్దపనా అంటూ గతంలో విమర్శించిన వారు ఇప్పుడు ఆ బటన్ నొక్కలేక చేతులెత్తేసారన్నారు. బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అందించడం కేవలం జగన్‌కే సాధ్యమన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేసేందుకు ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిట్ ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి - కాకినాడ

ఎంఎల్‌సి అనంతబాబు తన డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఉదంతంపై కూటమి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడం హర్షనీయమని టిడిపి నాయకుడు సరిపెల్ల రాజేష్ అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో దళితులపై దాడులు, హత్యలు చేయడం, లేకపోతే వారే ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించడం పరిపాటిగా మారిందన్నారు. దళితులపై జరిగిన దాడులలో డాక్టర్ సుధాకర్, వీధి సుబ్రహ్మణ్యం, ఒక రిపోర్టర్‌కు శిరోమండనం చేయించడం ఇలా ఎన్నో ఉన్నాయన్నారు. సుబ్రహ్మణ్యం హత్య చేసిన విధానంపై సిట్ వేసి అసలు హత్య వెనక ఎవరెవరున్నారు? ఏం జరిగింది అనేదానిపై కూటమి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ హత్యపై మొదటి నుంచి నిస్పక్షపాతంగా పోరాడుతున్న న్యాయవాది ముప్పాళ్ళ సుబ్బారావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు పలివెల రవి అనంతకుమార్, కొల్లాబత్తుల అప్పారావు, బండి సత్యనారాయణ పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

ప్రజాశక్తి - శంఖవరం

రత్నగిరిపై సత్య దేవుని పాత కల్యాణ మండపంలో ఉద్యోగులకు యోగాపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ తన దైనందిన జీవితంలో ఎన్నో మానసిక ఒత్తుడులకు గురౌతారని, అటువంటి వారు తప్పనిసరిగా యోగాపై దృష్టి సారించాలని అన్నారు. తద్వారా మానసిక ప్రశాంతతను పొందుతారని అన్నారు. కావున ప్రతీరోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని ఆయన సూచించారు.